సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 31 । మే । 2024



విషపుటీగల దాడి

నరసాపురం మండలం గొంది గ్రామంలో ఉపాధి పనులు నిర్వహిస్తున్న సమయంలో విషపుటీగలు దాడి చేయడంతో ఇద్దరు కూలీలకు గాయాలయ్యాయి. 8లో ▸



భానుడి ఉగ్రరూపం

రోహిణీ కార్తె నేపథ్యంలో భానుడు ఉగ్రరూపం దాల్చడంతో అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఉమ్మడి జిల్లాలో ప్రజలు వేడి, ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. 8లో ▸



గుంటుపల్లి బౌద్ధారామాలు

కామవరపుకోట మండలంలో గుంటుపల్లిలో బౌద్ధారామాలు పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. ఏటా కార్తీక మాసంలో ఇక్కడ తిరునాళ్లు నిర్వహిస్తుంటారు. 8లో ▸

కౌంటింగ్‌కు సిద్ధం

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జూన్ 4వ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపు కోసం జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తోంది. భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో.. ఆచంట, పాలకొల్లు, నరసాపురం, తణుకు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి శ్రీవిష్ణు కళాశాలలో కౌంటింగ్ నిర్వహణకు ఏర్పాట్లు దాదాపు పూర్తి కావచ్చాయి. ఆయా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మూడంచెల భద్రతను ఏర్పాటు చేస్తున్నారు.

- సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పక్కా ఏర్పాట్లు
- 'ఎస్ఆర్‌కేఆర్'లో భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం..
- విష్ణులో ఆచంట, పాలకొల్లు, నరసాపురం, తణుకు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు
- విష్ణులోనే పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ ఓట్లు
- 14 టేబుళ్లతో సిద్ధమైన కౌంటింగ్ హాళ్లు
- విధుల్లో 1500 మంది వరకు సిబ్బంది
- కట్టుదిట్టంగా మూడంచెల భద్రత



విష్ణు కళాశాలలో కౌంటింగ్ కోసం సిద్ధం చేసిన హాల్

సాక్షి, భీమవరం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జిల్లాలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ గాంధీ నేతృత్వంలో జిల్లా యంత్రాంగం సఫలీకృతమైంది. అదే ఒరవడితో కౌంటింగ్ ప్రక్రియను కూడా విజయవంతం చేసే పనిలో నిమగ్నమైంది. పోలింగ్ అనంతరం కట్టుదిట్టమైన భద్రత నడుమ భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల, నరసాపురం, పాలకొల్లు, తణుకు, ఆచంట నియోజకవర్గాల ఈవీఎంలను శ్రీవిష్ణు కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచారు. ఈ రెండు విద్యాసంస్థల్లోనే కౌంటింగ్‌కు కూడా చేపట్టేందుకు ఏర్పాట్లు చేశారు. ఆచంట, పాలకొల్లు నియోజకవర్గాలకు సంబంధించి అసెంబ్లీ, పార్లమెంట్ పక్కపక్కనే వేర్వేరు హాళ్లలో, మిగిలిన నియోజకవర్గాల అసెంబ్లీ, పార్లమెంట్‌లకు పెద్దపెద్ద హాళ్లను రెండుగా విభజించారు. పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం విష్ణు కళాశాలలో ఒక హాల్‌ను సిద్ధం చేశారు. కౌంటింగ్ జరిగే ఆయా హాళ్ల వద్ద కౌంటింగ్ స్టాఫ్ మినహా ఇతర సిబ్బంది, ఏజెంట్లు ఎవరూ లోపలికి ప్రవేశించకుండా బ్యారీకేడ్లు, ఇనుప మెస్‌లతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. రౌండ్‌కు 14 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంల ఓట్లు లెక్కించేందుకు వీలుగా ఒక్కో హాల్‌లో 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం పార్లమెంట్‌కు 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. కౌంటింగ్‌కు సిద్ధం చేసిన హాళ్లను ఇప్పటికే పోటీలో నిలిచిన అభ్యర్థులతో పాటు చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లు పరిశీలించారు. కౌంటింగ్ స్టాఫ్ మెస్ లోపల ఉండి ఈవీఎంలలో పోటీలోని అభ్యర్థులకు పోలైన ఓట్లను మెస్ వెలుపల ఉన్న వారివారి ఏజెంట్లకు చూపిస్తూ ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిర్వహించనున్నారు.

సిబ్బందికి శిక్షణ పూర్తి

ఒక్కో నియోజకవర్గానికి ఆర్ఓ, ఏఆర్ఓలతో పాటు కౌంటింగ్‌కు ఒక్కో టేబుల్ వద్ద ఒక మైక్రో అబ్జర్వర్, ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు విధులు నిర్వర్తిస్తారు. వీరితో పాటు సపోర్టింగ్ స్టాఫ్ తదితరులు కలిపి 1500 మంది వరకు సిబ్బంది కౌంటింగ్ విధుల్లో పాల్గొననున్నారు. కౌంటింగ్ విధివిధానాలపై ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఇప్పటికే కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ కౌంటింగ్ స్టాఫ్‌కు శిక్షణ ఇవ్వడంతో పాటు తొలి ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. కౌంటింగ్ తీరుతెన్నులపై అభ్యర్థులు, ఏజెంట్లకు అవగాహన కల్పించారు.

కౌంటింగ్ కేంద్రాలకు పటిష్ట భద్రత

రెండు కౌంటింగ్ కేంద్రాల వద్ద అల్లర్లు, హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్పీ డాక్టర్ అజిత కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర, ప్రత్యేక బలగాలతో మూడంచెల భద్రతను ఏర్పాటు చేస్తున్నారు.

అభ్యర్థులు, కౌంటింగ్ సిబ్బంది, ఎన్నికల కమిషన్ గుర్తింపు కార్డులు జారీ చేసిన వారు, ఎలక్షన్, కౌంటింగ్ ఏజెంట్లను మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తారు. కౌంటింగ్ ఆవరణకు కిలోమీటరు పరిధిలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు చేయనున్నారు.

కౌంటింగ్ జరిగేదిక్కడే..

ఆచంట
- అసెంబ్లీ: శ్రీమతి బి.సీత పాలిటెక్నిక్ కాలేజీ, సెకండ్ ఫ్లోర్, రూమ్ నంబర్ 310, సెమినార్ హాల్
- పార్లమెంట్: శ్రీమతి బి.సీత పాలిటెక్నిక్ కాలేజీ, సెకండ్ ఫ్లోర్, రూమ్ నంబర్ 313, సెమినార్ హాల్

పాలకొల్లు
- అసెంబ్లీ: శ్రీమతి బి.సీత పాలిటెక్నిక్ కాలేజీ, సెకండ్ ఫ్లోర్, డ్రాయింగ్ హాల్–1
- పార్లమెంట్: శ్రీమతి బి.సీత పాలిటెక్నిక్ కాలేజీ, సెకండ్ ఫ్లోర్, డ్రాయింగ్ హాల్–2

నరసాపురం
- అసెంబ్లీ, పార్లమెంట్ : శ్రీవిష్ణు ఫుడ్ ప్లాజా–1, డైనింగ్ హాల్

తణుకు
- అసెంబ్లీ, పార్లమెంట్: ఉమెన్ ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్ట్, శ్రీవిష్ణు స్కూల్ గ్రౌండ్

భీమవరం
- అసెంబ్లీ, పార్లమెంట్: ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, సెకండ్ ఫ్లోర్, యూ బ్లాక్, సిల్వర్ జూబ్లీ బిల్డింగ్, డ్రాయింగ్ హాల్

ఉండి
- అసెంబ్లీ, పార్లమెంట్: ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, గ్రౌండ్ ఫ్లోర్, ఎస్–101

తాడేపల్లిగూడెం
- అసెంబ్లీ, పార్లమెంట్: ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, థర్డ్ ఫ్లోర్, యూ బ్లాక్, సిల్వర్ జూబ్లీ బిల్డింగ్, డ్రాయింగ్ హాల్

పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్

విష్ణు ఫార్మశీ కళాశాల లైబ్రరీ రీడింగ్ రూమ్, గ్రౌండ్ ఫ్లోర్

న్యూస్‌రీల్

గూడెం ఫైర్ స్టేషన్ నూతన భవనం ప్రారంభం



తాడేపల్లిగూడెం ఫైర్‌స్టేషన్ భవనాన్ని ప్రారంభిస్తున్న సునీల్‌కుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెంలోని అగ్నిమాపక కేంద్ర నూతన భవనాన్ని ఏపీ రాష్ట్ర విపత్తు స్పందనా, అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్ పీవీ సునీల్‌కుమార్ గురువారం ప్రారంభించారు. అగ్నిమాపక శాఖ డైరెక్టర్ పీవీ రమణ, ప్రాంతీయ అగ్నిమాపక అధికారి ఇ.స్వామి, జిల్లా అధికారి జి.శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి అగ్నిమాపక శాఖ ఎంతో కృషి చేస్తోందని కొనియాడారు. ప్రమాదాలు సంభవించిన సమయంలో వేగంగా స్పందించి అగ్ని ప్రమాదాలను నివారించేందకు సిబ్బంది ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. అగ్నిమాపక సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని సునీల్ కుమార్ స్వీకరించారు. స్థానిక అగ్నిమాపక అధికారి గణేశ్న వెంకట రామారావు, ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 6,157 మంది హాజరు

భీమవరం: జిల్లాలో గురువారం నిర్వహించిన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఆర్ఐవో కె.చంద్రశేఖర్‌బాబు చెప్పారు. మొదటి సంవత్సరం జనరల్ పరీక్షకు 4,940 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 4,478 మంది, ఒకేషనల్ పరీక్షకు 759 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 565 మంది హాజరు కాగా, 194 మంది గైర్హాజరయ్యారన్నారు. అలాగే ద్వితీయ సంవత్సరం జనరల్ పరీక్షకు 1,058 మందికి 906 మంది హాజరుకాగా, ఒకేషనల్ పరీక్షకు 272 మందికి 208 మంది విద్యార్థులు హాజరయ్యారని చంద్రశేఖర్‌బాబు తెలిపారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షకు 61.06 శాతం హాజరు

జిల్లాలో గురువారం నిర్వహించిన టెన్త్ సప్లిమెంటరీ పరీక్షకు 61.06 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ చెప్పారు. జీవశాస్త్ర పరీక్షకు 7,058 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 2,748 మంది గైర్హాజరయ్యా రన్నారు. జిల్లా వ్యాప్తంగా 21 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని వెంకటరమణ తెలిపారు.

'సీఐపీఈటీ' దరఖాస్తుకు జూన్ 2 తుది గడువు

పాలకొల్లు సెంట్రల్: విజయవాడలోని భారత ప్రభుత్వ సంస్థ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సీఐపీఈటీ)లో డిప్లొమా, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి జూన్ 2తో గడువు ముగియనున్నట్లు సీఐపీఈటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులకు 3 ఏళ్ల వ్యవధి గల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ) కోర్సులు, బీఎస్సీ విద్యార్థులకు రెండేళ్ల వ్యవధిగల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ–పీపీటీ) కోర్సులను అందిస్తున్నట్లు తెలిపారు. 2024 జూన్ 2వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2024 జూన్ 9వ తేదీన విజయవాడ, అనంతపురంలో సీపెట్ అడ్మిషన్ టెస్ట్ (సీఏటీ) నిర్వహిస్తామన్నారు. దీనిలో ర్యాంకు ఆధారంగా విజయవాడ కేంద్రంలో 150 సీట్లను భర్తీ చేస్తామని తెలిపారు. ఈ కోర్సులలో చేరాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల కొరకు, పూర్తి వివరాల కోసం 93980 50255 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రేపటి నుంచి గ్రూపు-2 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

ఏలూరు (టూటౌన్): జూన్ 1 నుంచి బీసీ స్టడీ సర్కిల్ ఏలూరులో గ్రూపు–2 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్‌వీ నాగరాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీపీఎస్సీ గ్రూప్–2 ప్రిలిమ్స్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి జూలై 28న నిర్వహించే మెయిన్స్ పరీక్షకు సిద్ధమవుతున్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. లైబ్రరీ సౌకర్యం, స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉన్నాయని, శిక్షణా కాలంలో స్టైఫండ్, బుక్స్ అలవెన్స్ వంటి సౌకర్యాలు కల్పిస్తారన్నారు. అభ్యర్థులు బీసీ స్టడీ సర్కిల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మున్సిపల్ కార్పొరేషన్ ఇంగ్లిష మీడియం యూపీ స్కూల్, వెన్నవెల్లివారి పేట, ఏలూరు అడ్రస్‌కు లేదా 99123 94799, 83419 91001 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

లోపాలు లేకుండా పక్కా ఏర్పాట్లు



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్

భీమవరం (ప్రకాశంచౌక్): కౌంటింగ్ ఏర్పాట్లలో లోపాలు లేకుండా ఒకటికి, రెండు సార్లు సరిచూసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో గురువారం సమావేశమై కౌంటింగ్ ఏర్పాట్లపై పునఃసమీక్షించారు. ఇప్పటికే కౌంటింగ్ సిబ్బంది విధులకు సంబంధించి మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసుకున్నామని, అలాగే నియోజకవర్గాల స్థాయిలో రెండో ర్యాండమైజేషన్, కౌంటింగ్ సిబ్బందికి శిక్షణా తరగతులను జూన్ 2వ తేదీన పూర్తిచేయాలని ఆదేశించారు. సెల్‌ఫోన్‌లను ఎట్టి పరిస్థితుల్లో కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి లేదని ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి డిపాజిట్ చేయాలని సూచించారు. కౌంటింగ్ పూర్తయిన అనంతరం సంబంధిత కౌంటింగ్ సెంటర్ నుండి ఈవీఎంలను కట్టుదిట్టమైన భద్రత మధ్య నేరుగా జిల్లా ఈవిఎం గోడౌన్ కు తరలించాలని ఆదేశించారు. జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, ఆర్వోలు పాల్గొన్నారు.

నో ఫ్లైజోన్స్‌గా స్ట్రాంగ్ రూమ్ పరిసరాలు

భీమవరం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలు, వీవీ ప్యాడ్లు భద్రపరిచిన పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్, విష్ణు ఇంజనీరింగ్ కళాశాలల్లోని స్ట్రాంగ్ రూమ్ పరిసర ప్రాంతాలను నో ఫ్లైజోన్స్‌గా ప్రకటించినట్లు ఎస్పీ వేజెండ్ల అజిత గురువారం చెప్పారు. స్ట్రాంగ్ రూమ్ పరిసర ప్రాంతాలలో ఈ నెల 5వ తేదీ వరకు డ్రోన్లు ఎగరవేయడానికి ఎవరికి ఎటువంటి అనుమతులు లేవని, ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా డ్రోన్లు వినియోగిస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఎవరైనా డ్రోన్ ఉపయోగించాలంటే మినిస్ట్రీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ నుంచి 15 రోజులు ముందుగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

కౌంటింగ్ నిర్వహణ ఏర్పాట్లు భేష్

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా
- భీమవరంలో స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన



భీమవరంలో ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న ముఖేష్‌కుమార్ మీనా

భీమవరం: జిల్లాలో ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల్లో చేసిన ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్, విష్ణు ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓట్ల లెక్కింపునకు సంబంధించి చేపట్టిన చర్యలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. సుమారు 1,000 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లతో పాటు దాదాపు 400 మంది ఇతర సిబ్బంది కౌంటింగ్ విధుల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని, సూక్ష్మ పరిశీలన, సీసీ కెమెరాల నిఘా మధ్య కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించనున్నట్లు వివరించారు. బ్యారికేడింగ్, సూచిక బోర్డులు ఏర్పాటు, వాహనాల పార్కింగ్, మీడియా కేంద్రం ఏర్పాటు, రౌండ్ల వారీగా ఫలితాల వెల్లడి ప్రణాళిక, అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు అవసరమైన ఏర్పాట్లు, మార్గదర్శకాల మేరకు కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటు తదితర అంశాలను వివరించారు. పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంల్లోని ఓట్లను లెక్కించే ప్రక్రియలో భాగస్వాములుకానున్న కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు తదితరులకు శిక్షణ ఇస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ వివరించారు. ఎస్పీ వేజెండ్ల అజిత మాట్లాడుతూ 500 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు, కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లు, సమస్యాత్మక ప్రాంతాల్లో తీసుకున్న చర్యలు, కట్టుదిట్టమైన భద్రత, బందోబస్తుకు చేసిన ఏర్పాట్లను ముఖేష్‌కుమార్ మీనాకు వివరించారు. అనంతరం ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో జిల్లాలో పోలింగ్ ప్రక్రియ మాదిరిగానే కీలకమైన కౌంటింగ్‌ను విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన గుర్తింపు కార్డులు కలిగిన వారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రాలకు అనుమతించాలని ఆదేశించారు. ఎక్కడ ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పలు సూచనలు చేశారు. జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, ఏఎస్పీ వి.భీమారావు, ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఏటీవీ రవికుమార్, ఆర్వోలు కె.శ్రీనివాసులురాజు, కె చెన్నయ్య, వి.స్వామినాయుడు, బి.శివన్నారాయణరెడ్డి, ఎం.అచ్యుత అంబరీష్, బి.వెంకటరమణ పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపులో ఏజెంట్ల పాత్ర కీలకం

ఏలూరు (ఆర్ఆర్‌పేట)/దెందులూరు: సార్వత్రిక ఎన్నికల ఫలితాలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. మరో నాలుగు రోజుల్లో అంటే జూన్ 4న కౌంటింగ్ జరగనుంది. ఫలితాలపై ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు, ప్రజల తీర్పు ఏ అభ్యర్థికి అనుకూలంగా ఉందనే విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొని ఉంది. ఈ నేపథ్యంలో కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే ఏజెంట్లకు అధికారులు మార్గదర్శకాలను ఇప్పటికే సూచించారు. కౌంటింగ్ నిబంధనలపై ఏజెంట్లను ఎలా ఏర్పాటు చేసుకోవాలి, వారికి కౌటింగ్ నిబంధనలపై అవగాహన కల్పించడానికి ఇప్పటికే పోటీ చేసిన అభ్యర్థులకు, వారికి సంబంధించిన చీఫ్ ఏజెంట్లకు రెండు విడతల్లో శిక్షణ ఇచ్చారు.



కౌంటింగ్ సెంటరులో ఓట్ల లెక్కింపు ప్రక్రియ (ఫైల్)

ఏజెంట్‌గా అర్హతలివే..

కౌంటింగ్ ఏజెంట్‌కు 18 ఏళ్లు నిండి ఉండాలి. సాయుధ రక్షణ కలిగి ఉన్న వారిని అనుమతించరు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మేయర్లు, జెడ్పీ చైర్మన్లు, అన్ని పబ్లిక్ రంగ సంస్థలు, కార్పొరేషన్ చైర్మన్లు కూడా ఏజెంట్లుగా అనర్హులు. ప్రభుత్వం నుంచి గౌరవవేతనం పొందే వారు, ప్రభుత్వ, ఎయిడెడ్ సంస్థల్లో పనిచేసే పార్ట్‌టైం ఉద్యోగులు, పారా మెడికల్ స్టాఫ్, రేషన్ డీలర్లు, అంగన్‌వాడీ ఉద్యోగులు పోలింగ్ ఏజెంట్లుగా ఉండకూడదు. ప్రభుత్వ ఉద్యోగులు ఏజెంట్లుగా వ్యవహరిస్తే మూడు నెలలు జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. సర్పంచ్‌లు, పంచాయతీ వార్డు సభ్యులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ఏజెంట్లుగా వ్యవహరించేందుకు ఎలాంటి అభ్యంతరం ఉండదు. భారత పౌరసత్వం కలిగిన ఎన్ఆర్ఐకు కూడా అర్హత ఉంటుంది. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి తనకు గన్‌మెన్‌ను స్వచ్ఛందంగా వదులుకుంటే కౌంటింగ్ హాలులో కూర్చొనేందుకు అనుమతి ఇస్తారు. ఒక కౌంటింగ్ హాలులో 14 టేబుల్స్ ఉంటాయి. ఆ మేరకు అభ్యర్థులు ఏజెంట్లను నియమించుకోవచ్చు. పోస్టల్ బ్యాలెట్లకు లెక్కింపు అవసరాలు భావిస్తే అందుకోసం వేరే కౌంటింగ్ హాలులో అదనపు టేబుళ్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అదనంగా మరో కౌంటింగ్ ఏజెంటును నియమించుకోవచ్చు.

ఫారం–17సీపై అవగాహన అవసరం

కౌంటింగ్ సమయంలో టేబుల్ వద్దకు కంట్రోల్ యూనిట్‌తో పాటు ఫారం–17 సీలోని వివరాలను ఏజెంట్లు తప్పనిసరిగా రాసుకోవాలి. కంట్రోల్ యూనిట్ డిస్‌ప్లే సెక్షన్‌లో చూసిన పోలైన మొత్తం ఓట్లు ఫారం–17 సీలో నమోదు చేసిన ఓట్ల సంఖ్యతో సమానంగా ఉండాలి. క్లరికల్ తప్పిందంతో కాని కంట్రోల్ యూనిట్ ఫారం–17 సీలో ఓట్ల సంఖ్యతో తేడా వస్తే అది వివాదాస్పదంగా మారుతుంది. అలాంటి కంట్రోల్ యూనిట్లను రిటర్నింగ్ అధికారిని పక్కన ఉంచి ఎన్నికల కమిషన్‌కు సమాచారం అందిస్తారు. కంట్రోల్ యూనిట్ టేబుల్‌పైకి రాగానే ఏజెంట్లు పరిశీలనకు వస్తారు. ఆ కంట్రోల్ యూనిట్‌ను ఏ పోలింగ్ కేంద్రానికి చెందిందో ఏజెంట్లు నిర్ధారించుకోవాల్సి ఉంటుంది.

గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నాం



కౌంటింగ్ ఏజెంట్ల జాబితాను అభ్యర్థులు అందజేశారు. ఫారం–18లో రెండు కాపీలను సమర్పించారు. వాటిలో ఒకటి మావద్ద, మరొకటి వారి వద్ద ఉంటుంది. దీనితో పాటు ఏజెంట్లకు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నాం. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాట్లు వారే చేసుకోవాలి. సిబ్బందికి మాత్రం ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. ఏజెంట్లు ఎవరూ కౌంటింగ్ కేంద్రానికి సెల్‌ఫోన్లు తీసుకురాకూడదు.

– ఎం.ముక్కంటి, ఏలూరు అర్బన్ తహసీల్దార్, ఏలూరు నియోజకవర్గ ఆర్వో

పకడ్బందీగా లెక్కింపు ప్రక్రియ



ఓట్ల లెక్కింపును పకడ్బందీగా చేపడతాం. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ఏజెంట్ల నియామకంలో ఎన్నికల సంఘం నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. ఈ ప్రక్రియను పక్కాగా పర్యవేక్షిస్తున్నాం. ప్రభుత్వ శాఖలో పనిచేసేవారు ఏజెంట్లుగా ఉండకూడదు. పారదర్శకంగా కౌంటింగ్ నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశాం. వచ్చే నెల 6వ తేది వరకు 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉంటుంది. విధుల్లో ఉన్న పోలీసులకు, ఉద్యోగులకు ప్రజలందరూ సహకరించాలి.

– బి.లావణ్యవేణి, జేసీ, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి

ప్రభుత్వ సానుకూలతతోనే
పెరిగిన మహిళల ఓటింగ్

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్



సాక్షి, భీమవరం: సార్వత్రిక ఎన్నికల్లో పురుషుల కంటే అధికంగా మహిళల ఓటింగ్ పెరగడానికి ప్రభుత్వ సానుకూలతే కారణమని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. పోలింగ్ సరళిని బట్టి వైఎస్సార్ సీపీ మరో మారు అఖండ విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఎమ్మెల్సీ శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన అమ్మఒడి, ఇళ్ల పట్టాలు, చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, ఆసరా తదితర పథకాలు మహిళల జీవితాల్లో వెలుగులు నింపి వారిని ఆర్థికంగా ఎదిగేలా చేశాయన్నారు. విద్యారంగంలోకి విప్లవాత్మక మార్పులు తెచ్చి సంపన్నులతో సమానంగా తమ పిల్లలకు ఇంగ్లిష్ మీడియం చదువులు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు మహిళలు మద్దతు తెలిపారన్నారు. ఈ ఎన్నికల్లో 60 శాతానికి పైగా మహిళలు తమ సొంత అభిప్రాయంపై స్వేచ్ఛగా ఓటు వేశారని పలు పేరొందిన సంస్థలు తమ నివేదికల్లో వెల్లడిస్తున్నాయన్నారు. మహిళల ఓట్లు వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్నాయని పోలింగ్‌కు ముందు పలు సర్వే సంస్థలు తెలిపాయన్నారు. మహిళల పోలింగ్ శాతం పెరగడం కూటమిని కలవరపరుస్తోందని ఎమ్మెల్సీ శ్రీనివాస్ అన్నారు.

జాతీయస్థాయి నాటికల పోటీలు ప్రారంభం



సినీ నిర్మాత తుమ్మలపల్లిని సన్మానిస్తున్న దృశ్యం

భీమవరం : భీమవరం డీఎన్నార్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో చైతన్య భారతి 17వ జాతీయస్థాయి సాంఘిక నాటికల పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సినీ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, రంగస్థల నటులు డాక్టర్ పురాణం రామ్‌కుమార్, జనాబ్ ఎస్ఎం బాషా మాట్లాడుతూ సమాజంలో చైతన్యం తీసుకువచ్చేందుకు నాటకాలు దోహదపడతాయన్నారు. చైతన్య భారతి నాటక పరిషత్ అధ్యక్షుడు రాయప్రోలు మాట్లాడుతూ జూన్ 2 వరకు జరిగే ఈ పోటీల్లో 9 నాటికలను ప్రదరిస్తున్నట్లు చెప్పారు. అనంతరం సినీ నిర్మాత తుమ్మలపల్లికి ఆత్మీయ చైతన్య పురస్కారం, రంగస్థల నటులు పురాణంకు జవ్వాది రంగస్థల చైతన్య పురస్కారం, రంగస్థల నటులు బాషాకు మైనంపాటి శ్రీరంగ నాయకులు రంగస్థల చైతన్య పురస్కారాలతో సత్కరించారు. గోవాడ క్రియేషన్స్ హైదారాబాద్ వారి 'మూల్యం' నాటకం అందరినీ ఆకట్టుకుంది. డీఎన్నార్ కళాశాల పాలకవర్గ జాయింట్ సెక్రటరీ కూనపరాజు రామకృష్ణంరాజు, రాయప్రోలు శ్రీనివాసమూర్తి, రాయప్రోలు భగవాన్, పీఆర్వో భట్టిప్రోలు శ్రీనివాస్, వడుపు గోపి, పెన్నాడ శ్రీను, కె.వెంకటరమణ, ఎస్.మహేష్‌కుమార్ వర్మ, పేరిచర్ల లక్ష్మణవర్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జల్లేరు జలాశయం గేట్ల పరిశీలన



జల్లేరు జలాశయం నీటి సామర్థ్యం ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మెకానికల్ ఇంజనీరింగ్ బృందం

బుట్టాయగూడెం : దొరమామిడి సమీపంలోని గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయాన్ని మెకానికల్ ఇంజనీరింగ్ బృందం (విజయవాడ) గురువారం సందర్శించారు. జలాశయంలోని గేట్ల పనితీరు, ప్రాజెక్టు గట్టు పటిష్టత తదితర పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జనరల్ సూపరింటెండెంట్ ఆర్.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఏడాది వర్షాకాలానికి ముందు జలాశయాల గేట్ల పనితీరును పరిశీలించడం జరుగుతుందని చెప్పారు. దీనిలో భాగంగానే జల్లేరు జలాశయం గేట్లను కూడా పరిశీలించామన్నారు. జనరేటర్ల ద్వారా కూడా గేట్లు పనిచేసే తీరును పరిశీలించామని చెప్పారు. అలాగే గట్టు, లాక్‌లను కూడా పరిశీలించామని.. అన్నీ సక్రమంగానే ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఐఈఈ ఎం.రాంబాబు, డీఈఈ బి.జాహ్నవి, డీఈ పి. ఆనంద్ కుమార్, ఏఈ కె.వీరయ్య, ఏఈ వి.లక్ష్మీతులసి, ఏఈఈ టి.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేగేట్‌ను ఢీకొన్న పాలవ్యాన్

ఉండి: ఉండి రైల్వేగేట్‌ను పాలవ్యాన్ ఢీకొట్టడంతో ఉండిలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఉదయం 10.45 నిమిషాల సమయంలో నర్సాపూర్ నుంచి విజయవాడ వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు కోసం గేట్‌మేన్ గేటు వేయడంతో అదే సమయంలో భీమవరం నుంచి విజయవాడ వెళుతున్న ఖాళీ పాలవ్యాన్ (లారీ) వేగంగా గేటును ఢీకొట్టింది. దీంతో గేటులో సమస్య ఏర్పడి ఇరువైపులా సుమారు గంట సేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఉండి పోలీసులు ఘటనాస్థలికి వచ్చి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

హుండీల చోరీ

కామవరపుకోట: తాడిచెర్ల గ్రామంలో దొంగలు ఆలయ హుండీలను పగలగొట్టి చోరీ చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని శ్రీ దుర్గా మల్లేశ్వరి స్వామి ఆలయంలో బుధవారం రాత్రి సుమారు 3 గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు కలిసి ఆలయంలోని హుండీ పగలగొట్టి అందులో ఉన్న నగదు దొంగలించగా అది సీసీ ఫుటేజీలో రికార్డ్ అయ్యింది. అదే రోజు రాత్రి అభయాంజనేయ స్వామి విగ్రహం దగ్గర హుండీని, మేరీ మాత విగ్రహం దగ్గర హుండీని పగలగొట్టి నగదు చోరీ చేశారని, ఈ ఘటనపై తడికలపూడి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.



పెంటపాడు: నిర్మానుష్యంగా మారిన తాడేపల్లిగూడెం పోలీస్ ఐలాండ్ సెంటర్





పెంటపాడు: ప్రత్తిపాడు వద్ద జాతీయరహదారిపై ఇలా..

భానుడి ఉగ్రరూపం

భానుడి ఉగ్రరూపానికి ప్రజలు విలవిల్లాడుతున్నారు. రోహిణి కార్తెలో సూరీడు తన విశ్వరూపం చూపిస్తుండడంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రెండు రోజుల నుంచి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 7 గంటల నుంచే తీవ్రమైన వేడి, వడగాలులు వీస్తున్నాయి. దీంతో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. జనసంద్రం లేక రోడ్లు సైతం నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యవసర పనులు ఉంటే తప్ప ఈ ఎండల్లో బయట తిరగవద్దని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకుంటే మేలు

- ఎండలో బయటకు వెళ్లేటప్పుడు గొడుగును తీసుకెళ్లాలి.
- పలుచని తెలుపు రంగు కాటన్ వస్త్రాలు ధరించాలి.
- తలకు టోపీ పెట్టుకోవాలి లేదా రుమాలు చుట్టుకోవాలి.
- ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆరుబయట అధిక శ్రమతో కూడిన పనులు చేయరాదు.
- మజ్జిగ, నిమ్మరసం, మంచినీరుతో పాటు, ఓఆర్ఎస్ ద్రావణం, శీతల పానీయాలు వెంట తీసుకెళ్లాలి.
- వడదెబ్బ తగిలినవారికి వెంటనే వైద్యపరీక్షలు చేయించాలి.
- ఎక్కువగా నీరు, ద్రవపదార్థాలు సేవించాలి.
- ఎండలో పనిచేయాల్సి వచ్చినప్పుడు ప్రతి 20 నిమిషాలకు ఒకసారి ద్రవ పదార్థాలు తీసుకోవాలి.

భీమవరంలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

భీమవరంలో గురువారం అత్యధికంగా 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకాగా జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెంలలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గాలిలో తేమశాతం తగ్గడంతో ఉక్కపోత పెరిగి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మరికొన్ని రోజులు ఇలాగే ఎండలు ఉంటే పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు.

మండుతున్న ఎండలు

- రోహిణీ కార్తెలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న వైనం
- వేడి, ఉక్కబోతతో విలవిల్లాడుతున్న ప్రజలు



గణపవరం: ఎండ నుంచి రక్షణగా తలకు టోపీ, ముఖానికి తువ్వాలుతో ట్రాక్టర్ డ్రైవర్



నిర్మానుష్యంగా గణపవరం పోలీస్ ఐలాండ్ కూడలి

పెంటపాడు: రోహిణీ కార్తె ఎండలకు రోళ్లు పగులుతాయన్న నానుడి ఉంది. ఆ మాదిరిగానే ప్రస్తుతం జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. రోజురోజుకూ వేసవి తీవ్రత పెరుగుతోంది. మరోపక్క కేరళను రుతుపవనాలు తాకాయన్న శుభవార్త వినబడుతోంది. ఆ ప్రభావం వల్లనేమో మూడు రోజులు తీవ్ర ఉష్ణోగ్రతలు ఉంటాయని వాతావరణ శాఖ చెబుతోంది. కాగా గత రెండు రోజుల నుంచి ఉదయం 7 గంటలకే భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. 10 గంటలకే రోడ్లపైకి రాకపోకలు తగ్గుతున్నాయి. సాయంత్రం 5 గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగుతోంది. అధికంగా ఎండ, ఉక్కపోత, తీవ్ర చమట వల్ల ప్రజలు అల్లాడిపోతున్నారు. ప్రధానంగా వృద్ధులు, చిన్నారులు ఎండలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పనులు ఉంటే మినహా ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. కొందరు ప్రయాణాలు సైతం వాయిదా వేసుకుంటున్నారు. రహదారులు, ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. 16వ నెంబర్ జాతీయరహదారిపై ప్రయాణించే వాహనదారులు ఎండ తీవ్రత సమయంలో రోడ్లకు ఇరువైపులా చెట్లకింద వాహనాలు నిలిపివేసి సేదదీరుతున్నారు. అత్యవసర పనులపై బయటకు వచ్చేవారు ఎండనుంచి రక్షణగా గొడుగులు, క్యాప్‌లు వంటి రక్షణ సాధనాలను వినియోగిస్తున్నారు. ఎండనుంచి ఉపశమనానికి శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా జ్యూస్ సెంటర్లు, కొబ్బరిబొండాల వ్యాపారాలు జోరందుకున్నాయి. ఈ ఎండల నుంచి రక్షణ కోసం తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యసిబ్బంది సూచిస్తున్నారు.

ఉష్ణతాపానికి ఆపసోపాలు

గణపవరం: ఉష్ణతాపానికి జనం ఆపసోపాలు పడుతున్నారు. రోహిణికార్తె ప్రవేశంతో గత నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతూ ఉన్నాయి. గురువారం కూడా ఎండ తారెత్తించింది. ఉదయం 7 గంటలకే ఉక్కబోత మొదలై సాయంత్రం 6 గంటలు దాటినా ఏమాత్రం ఉపశమనం కలగడంలేదు. కొల్లేరులో కిక్కిసను మంటపెట్టడంతో రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు తీవ్ర రూపం దాల్చాయని చెబుతున్నారు. కిక్కిస గడ్డి కాలిన బూడిద కొల్లేరు చుట్టూ ఆనుకుని ఉన్న గ్రామాల్లో రెండురోజులుగా గాలిలో ఎగురుతూ వస్తుంది. ఎండతీవ్రతకు తోడు ఉక్కబోత పెరిగిపోవడంతో ఇళ్లల్లో, కార్యాలయాల్లో ఫ్యాను, ఏసీ వంటివి లేకుండా రెండు నిముషాలుకూడా ఉండలేని పరిస్థితి ఏర్పడింది. ఎండ తీవ్రతకు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ వ్యాపారులు దుకాణాలు మూసివేస్తున్నారు.

వడగాలులతో జాగ్రత్త



రోజురోజుకూ ఉష్ణోగతలు పెరిగిపోతున్నాయి. వడగాలులు వీస్తున్నాయి. ఎండలలో పనిచేసేవారికి, తిరిగేవారికి వడదెబ్బ తగిలే ప్రమాదముంది. ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే నీడ ప్రదేశానికి చేర్చాలి. తడి బట్టతో శరీరమంతా తుడిచి, చల్లని గాలి తగిలే విధంగా చూడాలి. ఓఆర్ఎస్ ద్రావణం తాగించి, వీలైనంత త్వరగా వైద్యులను సంప్రదించాలి. పీహెచ్‌సీల్లో అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నాం.

– డాక్టర్ పూజిత, ప్రభుత్వ ప్రాథమిక వైద్యాధికారి, ముదునూరు పీహెచ్‌సీ



జనం లేక వెలవెలబోతున్న ఫైర్‌స్టేషన్ సెంటర్

జనం విలవిల

ఏలూరు నగరంలో గురువారం ఎండలు తారెత్తించాయి. ఉదయం 8 గంటల నుంచే ఎండ మండిపోతుండడంతో జనం బయటకు రావాలంటనే హడలెత్తిపోయారు. తీవ్రమైన వేడి, వడగాలులను తట్టుకోలేక చిన్నారులు, వృద్ధులు అల్లాడిపోతున్నారు. మధ్యాహ్నం 12 గంటలు దాటక ముందే రద్దీగా ఉండే ప్రాంతాలు కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చేవారు తగిన జాగ్రత్తలు తీసుకుని బయటకు వచ్చే పరిస్థితి ఏర్పడింది.

– సాక్షిఫోటోగ్రాఫర్/ ఏలూరు




వేడికి ఇలా కప్పుకోక తప్పదు మరీ..




వేడిని తట్టుకోలేక నీడలో సేదతీరుతూ..

చారిత్రక ఆనవాళ్లు.. గుంటుపల్లి బౌద్ధారామాలు

- పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న గుంటుపల్లి గుహలు
- ఏటా కార్తీక మాసంలో నిర్వహిస్తున్న తిరునాళ్ల
- మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికుల డిమాండ్



ఇటుకలతో నిర్మించిన చైత్య స్థూపాలు




చైత్య గుహాలయాలు



పాలరాతి స్థూపం



బౌద్ధారామాలను సందర్శించిన విదేశీ బౌద్ధ భిక్షువులు (ఫైల్)



ధర్మలింగేశ్వర స్వామి ఆలయం

కామవరపుకోట: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఎన్నో పర్యాటక ప్రదేశాల్లో కామవరపుకోట మండలం జీలకర్రగూడెం గ్రామంలోని గుంటుపల్లి బౌద్ధ గుహలు ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. ఈ బౌద్ధారామాలు చరిత్రకు సాక్ష్యధారాలుగా నిలిచాయి. ఈ బౌద్ధ గుహలు మండల కేంద్రానికి 7 కిలోమీటర్లు, జిల్లా కేంద్రానికి 42 కిలోమీటర్లు, ప్రసిద్ధ ద్వారకాతిరుమలకు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి.

అశోకుడి కాలం నాటిదిగా అంచనా..

2వ శతాబ్దం నాటి శాసనం ఇక్కడ లభించడంతో ఈ గుహలను అశోకుడి కాలం నాటిదిగా భావిస్తారు. క్రీస్తు శకం 1889లో అలెగ్జాండర్ చేపట్టిన త్రవ్వకాల్లో కొండలో మలిచిన ఆలయం, ఇటుకలతో కట్టిన స్థూపాలు, విహారాలు ఇక్కడ బయటపడ్డాయి. ఈ పర్వతం సర్పాకారంలో ఉండటంతో దీనికి మహానాగ పర్వతం అని పేరు వచ్చింది. ఈ ఆరామాలు గుర్రపునాడా ఆకారంలో సుందరంగా ఉంటాయి. ఈ గుహల్లో దొరికినా బంగారపు భిక్షపాత్ర, బుద్ధుని ధాతువు, పూసలు ఇప్పటికీ చైనా మ్యూజియంలో భద్రంగా ఉన్నాయి. చైనా యాత్రికుడు హుయాన్ త్సాంగ్ భారత దేశ పర్యటనలో భాగంగా ఈ గుహలను సందర్శించారని చరిత్రకారులు చెబుతారు. బుద్ధుని అవశేషాలు దేశంలో ఎనిమిది చోట్ల ప్రతిష్టించినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. గుంటుపల్లి పాలరాతి కింద బుద్ధిని అవశేషాలు ఉన్నాయని చరిత్రకారులు అంచనా. బౌద్ధ భిక్షువులు మత ప్రచారం కోసం మహారాష్ట్ర రాజధాని అమరావతి నుంచి గుంటుపల్లి వచ్చి ఈ గుహలను ఏర్పరుచుకుని ప్రచారం చేపట్టారని చరిత్ర చెబుతోంది. ఈ బౌద్ధ ఆరామాల్లో పెద్ద ఆరామం, చిన్న ఆరామం, మొక్కుబడి స్థూపం, రాతితో కట్టిన స్థూపం, శిథిల మండపం, ఇటుకలతో కట్టిన చైత్య గృహం, వృత్తాకార చైత్య స్థూపం ఇలా ఎన్నో ఆధారాలు పురావస్తు శాఖ చేపట్టిన తవ్వకాల్లో ఇక్కడ బయటపడ్డాయి. ఈ గుహలను సందర్శించడానికి విదేశీయులు బౌద్ధ భిక్షువులు చాలాసార్లు వస్తూ ఉంటారు.

ప్రసిద్ధి చెందిన గట్టు తీర్థం

ఇక్కడ గుహాలయాన్ని ప్రజలు ధర్మ లింగేశ్వర దేవాలయంగా పేర్కొంటారు. జగద్గురు ఆది శంకరాచార్యులు విదేశీ పర్యటనలో భాగంగా బౌద్ధారామంలోని ప్రధాన స్తూప చైతన్యాన్ని ధర్మ లింగేశ్వర స్వామిగా రూపాంతరం చేసి పూజలు చేశారని బౌద్ధులు చెబుతుంటారు. ప్రతిఏటా కార్తీకమాసంలో తిరునాళ్ల నిర్వహిస్తారు. గట్టు తీర్థంగా ప్రసిద్ధి చెందిన ఈ తిరునాళ్లలో మూడవ సోమవారం యాత్రికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. జిల్లాతోపాటు పొరుగు జిల్లాల నుంచి యాత్రికులు భారీగా తరలివస్తుంటారు. ఈ ప్రాంతాన్ని పాండవులు తిరిగిన ప్రదేశంగా స్థానికులు చెప్పుకుంటారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి



ఈ ప్రదేశానికి చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు దేశ, విదేశాల నుంచి పర్యాటకులు వస్తూ ఉంటారు. కానీ ఇక్కడ సరైన సదుపాయాలు లేకపోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడకు వచ్చే పర్యాటకులకు రాత్రి బస చేసే విధంగా విద్యుత్ సౌకర్యంతో పాటు, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి. అదేవిధంగా క్రింద నుంచి కొండ పైకి వెళ్లుటకు రోప్‌వే ఏర్పాటు చేసి దీన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

– బొల్లు వెంకట సత్యనారాయణ, గ్రామస్తుడు కామవరపుకోట

ఉపాధి కూలీలపై విషపుటీగల దాడి



పాలకొల్లు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యర్రంశెట్టి నాగరాజు

నరసాపురం రూరల్: నరసాపురం మండలంలోని గొంది గ్రామంలో గురువారం విషపుటీగల దాడిలో ఇద్దరు గాయాలపాలయ్యారు. ఉపాధిహామీ పథకం పనుల్లో భాగంగా గ్రామంలోని ఓ పంట బోదెను తవ్వే క్రమంలో ఉదయం 9 గంటల ప్రాంతంలో విషపుటీగలు ఒక్కసారిగా పెద్ద ఎత్తున దాడి చేయడంతో యర్రంశెట్టి నాగరాజు, మోకా నరసింహస్వామి అనే ఇద్దరు ఉపాధి కూలీలు గాయాలపాలయ్యారు. తలపైన, వీపు భాగంలోనూ ఎక్కువగా విషపుటీగలు కుట్టడంతో వారిద్దరిని పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ ఆంజనేయులు, ఏపీవో వై శ్రీనివాస్ మాట్లాడుతూ గాయపడిన ఇద్దరు కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారన్నారు. కాగా మండలంలోని తీరప్రాంత గ్రామాలైన తూర్పుతాళ్లు, పెదమైనవానిలంక, వేములదీవి, ఎల్బీచర్ల తదితర గ్రామాల్లో పలుమార్లు విషపుటీగలు దాడి చేసిన సంఘటనలు ఉన్నాయని, విషపుటీగల నిర్మూలనకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు, ఉపాధి కూలీలు కోరుతున్నారు.



చికిత్స పొందుతున్న బొల్లు మోకా నరసింహస్వామి

వేద పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆకివీడు: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర వేద విశ్వ విద్యాలయం ఆధీనంలో నడుస్తున్న వేద పాఠశాలల్లో ప్రవేశానికి బాలుర నుంచి దరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నట్లు వేద పాఠశాల ప్రతినిధి తెలిపారు. ఈమేరకు వెబ్‌సైట్‌లో వీక్షించి జూన్ 20వ తేదీలోపు దరఖాస్తుల్ని పంపాలని చెప్పారు. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న వేద పాఠశాలల్లో అయిభీమవరం గ్రామంలోని వేద పాఠశాలతో పాటు ధర్మగిరి, విజయనగరం, నల్గొండ, కీసర గుట్ట, కోటప్ప కొండ ప్రాంతాల్లోని పాఠశాలల్లో వేదం నేర్చుకునేందుకు దరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నారు. వైదిక సాంప్రదాయం ప్రకారం ఉపనయనం కాబడి, నిర్ణీత వయస్సు, విద్యా ప్రమాణాలు కల్గిన బాలల నుంచి దరఖాస్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా

పేరుకుపోయిన తామరాకులు



కొండేపాడు తాగునీటి చెరువులో మహావృక్షాల్లా పెరిగిన తామరాకులు

పెంటపాడు: మండలంలోని కొండేపాడులో తాగునీటి చెరువు కలుషితంగా మారింది. ఈ గ్రామంలో పేరుకు రెండు చెరువులు ఉన్నా పెద్ద చెరువుతో పాటు, తాగునీరందించే చిన్న చెరువు కూడా తూడు, తామరాకులతో పెరిగి పోవడంతో తాగునీటికి అవస్థలు తప్పడం లేదు. ఈ రెండు చెరువులు కలుషిత కాసారంగా మారాయి. నీరు దుర్వాసన వస్తోందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

పౌష్టికాహారం సక్రమంగా తీసుకోవాలి



విప్పర్రులో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

పెంటపాడు: హార్మోన్లు సమతుల్యతకు పౌష్టికాహారం సక్రమంగా తీసుకోవాలని సీడీపీవో టీఎల్ సరస్వతి తెలిపారు. పెంటపాడు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం కిశోర్ బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పెంటపాడు, ముదునూరు పాడు వైద్యాధికారులు డా.మౌనిక, డా.పూజితలు మాట్లాడుతూ బాలికలు, మహిళలు సమతుల ఆహారం తీసుకోవడం వల్ల రుతుక్రమ సమస్యలు రాకుండా నియంత్రించవచ్చొన్నారు. పడమరవిప్పర్రు గ్రామంలో సూపర్‌వైజర్ జీజీబీ విజయలక్ష్మి, పెంటపాడు ఇన్‌చార్జి దుర్గాభవాని తదతరులు ఆయా సెంటర్లలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి నిర్మించాలి



మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు

ఆకివీడు: డబుల్ లైన్ నిర్మాణంతో ఆకివీడు ప్రాంతంలోని ప్రజలకు కొత్త సమస్యలు తలెత్తాయని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డబుల్, విద్యుద్దీకరణ పనులతో బ్రాంచి రైల్వే లైన్‌కు మోక్షం లభించిందని ఆనందపడ్డామని, అయితే ఆ ఆనందం ఎంతో కాలం నిలవలేదని వాపోయారు. డబల్ రైల్వే లైన్‌లో ప్రతి 15 నిమిషాలకొక రైలు తిరగడం వల్ల స్థానికులు గేట్ల సమస్యకు గురవుతున్నారన్నారు. గత కొన్నేళ్లుగా పట్టణంలో అండర్ గ్రౌండ్ మార్గం ఏర్పాటు చేయాలని ఉద్యమించినా రైల్వే అధికారులు పట్టించుకోలేదన్నారు. నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజుకు, రైల్వే అధికారులకు వినతి పత్రాలు అందజేశామన్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఏర్పడనున్న ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు అండర్ గ్రౌండ్ మార్గం ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. తక్షణంమార్గం కల్పించాలనికోరారు. సమా వేశానికి నాయకుడు పెంకి అప్పారావు అధ్యక్షతవహించారు. కార్యక్రమంలో డొకల లక్ష్మి, బీవీ.వర్మ, డొకల రవితేజ, బీ.రాంబాబు రులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ఘోర ప్రమాదం



సిద్ధాపురంలో రైల్వే హైటెన్షన్ హెచ్చరిక ఇనుప రాడ్డును గుద్దుకుని ఆగిన లారీ

ఆకివీడు: స్థానిక సిద్ధాపురం రోడ్డులో రైల్వే గేటులోని హైటెన్షన్ వైర్లకు సమీపంలో లోడు లారీ ప్రమాదపు అంచుల్ని దాటుకుని గురువారం హెచ్చరిక ఇనుప రాడ్డును ఢీకొట్టింది. సిద్ధాపురం వైపు నుంచి ఆకివీడు ప్రధాన సెంటర్ వైపు భారీ ఎత్తులో వేసిన లోడు లారీ ప్రమాద హెచ్చరికల్ని భేఖాతరు చేసింది. దీంతో హెచ్చరిక రాడ్డు విరిగి లారీపై పడిపోయింది. గేటు మధ్యలో ఉన్న హైటెన్షన్ వైర్లను తాకి ఉంటే లారీ అగ్నిప్రమాదానికి గురై దగ్దమైపోయి ఉండేదని ప్రజలు బెంబేలెత్తిపోయారు. భారీ లోడుతో ఉన్న లారీ ఒక వైపు హెచ్చరిక రాడ్డును దాటుకుని, హైటెన్షన్ వైర్లకు తగలకుండా బయట పడి, గేటు రెండవ వైపు ఉన్న రాడ్డుకు చిక్కడంలో ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా ప్రమాదం నుంచి బయట పడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఎక్కడ ప్లస్.. ఎక్కడ మైనస్..!

- కాగితాలపై లెక్కలేసుకుంటున్న నేతలు
- పోలింగ్ సరళిపైనా అభ్యర్థుల కుస్తీ
- పెరిగిన ఓటు శాతంపై శ్రేణులతో సమాలోచనలు



తణుకులో ఓట్లు వేసేందుకు క్యూ కట్టిన మహిళలు (ఫైల్)

తణుకు: ఎక్కడ ఎన్ని ఓట్లు పడ్డాయి? ఏ వార్డులో ఎంత పంపిణీ జరిగింది? ముట్టజెప్పిన డబ్బు పంపిణీ జరిగిందా లేక శ్రేణులు ఎంత వెనుకేసుకున్నారు? ఫలితం పరిస్థితి ఏంటనే లెక్కల్లో తణుకు నియోజకవర్గంలోని ప్రధాన పార్టీల అభ్యర్థులు తలమునకలయ్యారు. సార్వత్రిక సమరం ఓటింగ్ సమయం ముగియగానే ఎక్కడ ప్లస్? ఎక్కడ మైనస్ అంటూ కాగితాలపై రాతలు రాసి మరీ లెక్కలు వేసుకుంటున్నారు. గ్రామాలు, వార్డుల వారీగా నాయకులు, కార్యకర్తలు, సామాజికవర్గం నేతలతో గెలుపు ఓటములను ప్రస్తావిస్తూ ఆరా తీస్తున్నారు. ఎక్కడికక్కడ అంచనాలు వేసుకుంటూ వచ్చిన ఓట్లపై ఆరా తీస్తున్నారు. విజయం ఖాయమని అనుచరుల వద్ద ధీమా వ్యక్తం చేస్తూనే వార్డుల వారీగా ఎవరు ముందంజలో ఉండే అవకాశం ఉందని బేరీజు వేసుకుంటున్నట్లు అనుచరులు చర్చించుకుంటున్నారు. సూత్రప్రాయంగా ఇన్ని ఓట్లు వస్తాయనే భావనలో ఉన్నప్పటికీ గ్రామాలు, వార్డుల వారీగా శ్రేణుల నుంచి వెలువడే గణాంకాలపై చర్చ జరుగుతోంది. పోల్ మేనేజ్‌మెంటులో పాల్గొన్న నాయకుల నుంచి వస్తున్న అంచనాలపై నాయకులు బేరీజు వేసుకుంటున్నారు.

పెరిగిన పోలింగ్ శాతంపై...

ఈనెల 13న పోలింగ్ ముగియడంతో ఇప్పుడు ఓటరు ఎవరికి విజయాన్ని కట్టబెట్టాడనే ఉత్కంఠతో ఏ గ్రామంలో... ఏ వార్డులో ఎన్ని ఓట్లు పడ్డాయి? ఎవరెవరికి ఎన్నెన్ని ఓట్లు చీలుతాయి? గెలుపు పరిస్థితి ఏంటనే లెక్కలపై తలమునకలయ్యారనే చర్చ జరుగుతోంది. పెరిగిన పోలింగ్ శాతం ఎవరికి ప్రయోజనం చేకూరుతుందోనని లెక్కలు వేసుకుంటున్నారు. తణుకు అసెంబ్లీ నియోజకవర్గంలో 2,34,575 మంది ఓటర్లు ఉండగా 2019 ఎన్నికల్లో నమోదైన పోలింగ్‌తో పోల్చితే ఓటింగ్ శాతం ఈసారి పెరిగింది. 80.54 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం 2 శాతం అధికంగా నమోదయ్యింది. పెరిగిన పోలింగ్ శాతం ఎవరికి ప్రయోజనం అనేదానిపై కూడా అభ్యర్థులు సమాలోచనలు మొదలుపెట్టారు. మరోవైపు పోలింగ్ సరళి, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్న తీరు, ఓటింగ్‌లో పాల్గొన్న వారు వ్యక్తం చేసిన అభిప్రాయాలు బేరీజు వేస్తూ లెక్కల్లో మునిగి తేలుతున్నారు. ప్రజల్లో సంక్షేమం, అభివృద్ధి కోరుకుంటున్నారని పెరిగిన పోలింగ్ శాతం తేటతెల్లం చేస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. పురుష ఓటర్లు 1,14,435 మంది ఉండగా మహిళా ఓటర్లు 1,20,135 మంది ఉన్నారు. అంటే 5,700 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. వారి పోలింగ్ సరళి వైఎస్సార్ సీపీకి అనుకూలిస్తుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుండడంతో టీడీపీ శ్రేణుల్లో నైరాశ్యం వ్యక్తమవుతోంది. వారి ఓటు ఎటువైపు పడిందనే దానిపై ఆయా పార్టీల నేతలు విశ్లేషిస్తున్నారు.

పదోతరగతి సప్లిమెంటరీ పరీక్ష ప్రశాంతం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి గురువారం ఆరోవ రోజున జీవశాస్త్రం ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని ఏడు స్కూల్స్ జెడ్పీ ఉన్నత పాఠశాల, కడకట్ల మునిసిపల్ హైస్కూల్, సుబ్బారావుపేట మునిసిపల్ హైస్కూల్, కింబర్లీ, మాంటిస్సోరి, సెంట్ జోన్స్, భాష్యం స్కూల్‌లో జరిగాయి. 1110 మంది విద్యార్థులకు గాను 593 మంది పరీక్షలకు హాజరయ్యారు. 517 మంది పరీక్షలకు హాజరుకాలేదు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆర్‌డీఎస్ఎస్ స్కీంలో భాగంగా బైపరకేషన్ పనుల నిమిత్తం హౌసింగ్ బోర్డు, కొండయ్య చెరువు, పాతూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 31వ తేదీ శుక్రవారం రోజున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. వన్ టౌన్‌లో విద్యుత్ ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రుతు పరిశుభ్రతపై అవగాహన



తిరుపతిపురంలో అంగన్‌వాడీ కార్యకర్తల ప్రదర్శన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రావ్య

అత్తిలి: రుతుస్రావం సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత కలిగిఉండాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి బి సుజాతరాణి అన్నారు. తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో తిరుపతిపురంగల అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా కిశోర బాలికలకు రుతు పరిశుభ్రత దినోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో సుజాతరాణి మాట్లాడుతూ కిశోర బాలికలు శారీరక, మానసిక ఆరోగ్యంతో ఉండటానికి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, రుతుస్రావ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమని చెప్పారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి అంగన్‌వాడీ కార్యకర్తలు జి పార్వతి, బి లలితకుమారి, ఎస్ చంద్రిక, నోడల్ ఆఫీసర్ విజయలక్ష్మి, కిశోర బాలికలు పాల్గొన్నారు

కెఎస్ గట్టులో..

అత్తిలి మండలం కె సముద్రపుగట్టు అంగన్‌వాడీ కేంద్రంలో రుతుస్రావ పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని యుక్త వయస్సు పిల్లలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు దీపికారాణి, పూర్ణగిరి, నవోమి, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత దూరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బాలికలు ఆరోగ్యంపై పూర్తి అవగాహనతో ఉండాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ టీఎల్ సరస్వతి, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ శ్రావ్యలు అన్నారు. తాడేపల్లిగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో హెల్త్ సిబ్బందిచే పట్టణంలో గురువారం కిషోరు బాలికలకు రుతుక్రమం సమయంలో పరిశుభ్రత పాటించాలని, రక్తహీనతను లేకుండా ఉండేందుకు ఆహారంలో ఐరన్ ఎక్కువగా ఉండే విధంగా చూసుకోవాలని, పరిశుభ్రత పాటించాలని తెలిపారు. స్కూల్స్‌లో ఇచ్చే ఐరన్ మాత్రలను తప్పక తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. బాలికలకు ఎటువంటి సమస్యలు వచ్చిన తప్పనిసరిగా వైద్యలను సంప్రదించాలని సూచన లు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు సీహెచ్ భవానీ, కె.విశాలాక్షి, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ వరర్స్, ఆశాలు, కిషోరు బాలికలు పాల్గొన్నారు.

పరిశుభ్రంగా భోజనం అందించండి



సమావేశంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

పెంటపాడు: విద్యార్థులకు పరిశుభ్రంగా, నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా విద్యాశాఖ ఎస్ఎస్ఏ కోఆర్డినేటర్ కె. కృష్ణారావు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న వంట సిబ్బందికి, సహాయకులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం పెంటపాడు ప్రభుత్వ బేసిక్‌స్కూల్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి పెంటపాడు ఎంఈవో టీవీ రామకృష్ణ అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులకు పోషకాలు అందించే విధంగా రాగిజావ, చిక్కీలు, వంటగది శుభ్రత, గ్యాస్ లీక్, వ్యక్తిగత శుభ్రత పలు అంశాలపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి నిర్వహించిన వంటల పోటీలలో విజేతలైన మహిళలకు బహుమతులు అందజేశారు. స్కూలు కాంప్లెక్స్ చైర్మన్ ఎస్. రాజేష్, తదతరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



తణుకులో సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

తణుకు: కార్మికులకు కనీస వేతనం, పాత కార్మిక చట్టాలు కావాలంటే పోరాటాలే శరణ్యమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ అన్నారు. గురువారం స్థానిక అమర వీరుల భవనం వద్ద సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఐటీయూ పతాకాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.దక్షిణామూర్తి, పీఎల్ నర్సింహారావు, మండల కార్యదర్శి గుబ్బల గోపి, వాన్‌బరీ యూనియన్ కార్యదర్శి వల్లూరి వెంకటేశ్వరరావు, కేతా శ్రీనివాస్, ఎ.బ్రహ్మాజీ, త్రిమూర్తులు, గోవిందరాజు, ఎస్.రామకృష్ణ, గార రంగారావు, ఎన్.చిన్నారావు, విశ్వనాథం, బి.శివకుమార్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో..

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలలో గురువారం ఘనంగా జరిగాయి. సీఐటీయూ జెండా ఆవిష్కరణలు చేశారు. జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, సత్తి కోదండరామిరెడ్డి, చిర్ల పుల్లారెడ్డిలు మాట్లాడుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన పోరాటాలు, సాధించిన విజయాలను ప్రస్తావించారు. రానున్న భవిష్యత్తు పోరాటాలపై చర్చించారు. ఉల్లిపాయల మార్కెట్, అపరాల మార్కెట్, పండ్ల మార్కెట్, కూరగాయల మార్కెట్,చింతపండు మార్కెట్, యార్డు వద్ద, ఎరువుల మార్కెట్, మునిసిపల్ కార్యాలయం వద్ద, త్రిఫ్ వద్ద, రైల్వే గూడ్స్ షెడ్డు తదితర ఇతర ప్రాంతాలలో ఆవిర్భావ దినోత్సవాలు జరిగాయి. కార్మిక నాయకులు, కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

నడినెత్తిన నిప్పుల కుంపటి



సాయంత్రం నాలుగు గంటలకు చుర్రుమంటున్న సూరీడు

- నిర్మానుష్యంగా ప్రధాన రోడ్లు
- తణుకులో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

తణుకు: రోహిణి కార్తె తన ప్రభావాన్ని చూపిస్తోంది. గురువారం భానుడు భగభగమంటూ నిప్పులు కురిపించాడు. తణుకు పట్టణంలో ఎండ వేడిమికి ప్రజలు విలవిలలాడిపోయారు. గడచిన నాలుగు రోజుల నుంచి నెత్తిపై నిప్పుల కుంపటి అన్నట్లుగా వాతావరణం ఉంది. నిప్పుల కొలిమితో జాతీయ రహదారిపై రాకపోకలు సాగించేవారు అనేక అవస్థలు పడ్డారు. సూర్యతాపానికి ఇళ్లల్లో నుంచి ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. గత నాలుగు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండడంతో ఎండ చుర్రుమంటోంది. గురువారం పరిస్థితి మరీ దారుణంగా మారింది. జాతీయ రహదారితో పాటు పట్టణంలోని ప్రధాన రోడ్లు సైతం నిర్మానుష్యంగా మారాయి. సూర్యభగవానుని ఉగ్రరూపానికి ఎవరూ ప్రయాణాలు చేయలేక రద్దు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పది దాటితే ఎవరూ బయట తిరిగే సాహసం చేయలేకపోతున్నారు. రాత్రి వేళల్లో సైతం ఉక్కబోత కారణంగా ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎప్పుడెప్పుడు వర్షాలు కురుస్తాయా అంటూ ప్రజలు ఎదురు చూస్తున్నారు.

ఉదయం నుంచే ప్రభావం...

ఉదయం ఆరు గంటలకు సూర్య ప్రతాపం మొదలవుతోంది. ఉపాధి పనులకు వెళ్లే వారు తొమ్మిది గంటలకే ఇంటి ముఖం పట్టారు. జాతీయ రహదారిపై ఎక్కడా సేదతీరడానికి చెట్లు, షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణాలు సాగించేవారు నరక యాతన పడ్డారు. రోడ్డుకు ఇరువైపులా నేషనల్ హైవే నిర్వహణ అధికారులు నాటిన చిన్నమొక్కల నీడన సేదతీరాల్సిన దుస్థితి ఏర్పడింది. తప్పని పరిస్థితుల్లో రోడ్డుపై రాకపోకలు సాగించేవారు తలకు తడిగుడ్డలు చుట్టుకుని ప్రయాణించడం... ప్రతి ఫర్లాంగు దూరానికి గుక్కెడు మంచినీళ్లు తాగి ఉపశమనం పొందుతున్నారు. ద్విచక్రవాహన చోదకులు లారీల, వ్యాన్లు సందడి పెద్దగా లేకపోవడంతో జాతీయరహదారి నిర్మానుష్యంగా మారింది. పది గంటలు దాటితే వాహనాల రాకపోకలు రోడ్డుపై పెద్దగా కనిపించలేదు. సూర్యతాపాన్ని దష్టిలో ఉంచుకుని జాతీయరహదారిపై కొబ్బరి బొండాల విక్రయాలు జోరందుకున్నాయి. ఒక్కో బొండాం రూ.30కు విక్రయించారు. జాతీయరహదారిపై చలివేంద్రాలు లేకపోవడంతో వాటర్ ప్యాకెట్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. గురువారం తణుకు మండలంలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్టు తెలుస్తోంది.

నేడు హనుమాన్ పతాక బైక్ ర్యాలీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): హనుమాన్ జయంతి సందర్భంగా జూన్1వ తేదీ శనివారం పట్టణంలో హనుమాన్ పతాక బైక్ ర్యాలీ విజయవంతం చేయాలని శ్రీ దక్షిణముఖ అభయ ఆంజనేయ స్వామి ఆలయం నిర్వాహకులు ఆకుల నరసింహమూర్తి, సేవా సమితి సభ్యులు వెల్లడించారు. వైశాఖ బహుళ దశమి పర్వదినం పురస్కరించుకుని ఆంజనేయ స్వామికి రుద్రాభిషేకం, సాయంత్రం అప్పాల హోమం, రాత్రి సువర్చల సుందర హనుమాన్ కల్యాణం జరుగుతుందని, భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

రావిపాడులో కొనసాగుతున్న144 సెక్షన్

పెంటపాడు: మండలంలోని రావిపాడు గ్రామంలో సైనికఉద్యోగికి ఇచ్చిన స్థల వివాదంపై గ్రామంలో ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా గూడెం డీఎస్పీ మూర్తి ఆధ్వర్యంలో పోలీస్ పికెట్ కొనసాగుతోంది. గూడెం రూరల్ సీఐ రమేష్, పెంటపాడు ఎస్ఐ శంకర్ పర్యవేక్షణలో పలువురు పోలీసులు రావిపాడులో డ్యూటీలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు.

హుండీ ఆదాయం లెక్కింపు

పెనుగొండ: స్థానికమల్లప్ప దిబ్బలోని పెద్దింట్లమ్మ ఆలయ హుండి లెక్కింపు ద్వారా రూ.3,08,272 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పుష్పభాను తెలిపారు. గురువారం నాలుగు నెలలకు గానూ హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తణుకు డివిజన్ అధికారి జీఎస్‌వీ ప్రసాద్, ఆలయ ఈఓలు మన్నే శ్రీనివాస్, వి వివేకానంద వర్మ తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనాన్ని అందించాలి



ఉండిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారావు

ఉండి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అందించే మధ్యాహ్న భోజనాన్ని ఇంటివంటను తలపించేలా మంచి రుచికరంగా పెట్టాలని జిల్లా మిడ్‌డే మీల్ కన్వీనర్ కే కృష్ణారావు అన్నారు. గురువారం ఉండి జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయిలో మధ్యాహ్న భోజన నిర్వహకులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ విద్యాశాఖ ఆదేశాలను పాటించాలని సూచించారు. విద్యార్థులను తమ బిడ్డలుగా భావించి మెనూ ప్రకారం మంచి రుచిగల భోజనాన్ని వడ్డించాలని తెలిపారు. ఎంఈవో 2 బీ వి నాయకుడు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనాన్ని శుచితో పాటు రుచిగా వండాలని సూచించారు. ఎక్కడా ఇబ్బందులు లేకుండా ఏవైనా ఇబ్బందులు వస్తే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సిబ్బంది, మధ్యాహ్న భోజన పథకం నిర్వహకులు పాల్గొన్నారు.

క్షణికావేశాలకు గురై జైలు పాలు కావద్దు

ఆకివీడు: ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రజలు సహకరించాలని, క్షణికావేశాలకు గురై జైలు పాలుకావద్దని ఎస్ఐ బత్తిన నాగబాబు విజ్ఞప్తి చేశారు. స్థానిక జానకీ నగర్‌లో కార్డన్‌సెర్చ్ గురువారం నిర్వహించారు. ఆ ప్రాంతంలో ఇంటింటికీ తిరిగి తనిఖీలు చేశారు. కౌంటింగ్ సమయంలో ఎవరూ బయట తిరగరాదని, గుంపులు గుంపులుగా తిరిగితే 144 సెక్షన్ అమలులో ఉన్నందున కేసులు పెడతామని హెచ్చరించారు. ఎవరి వద్ద మారణాయుధాలు, ప్రమాదకర వస్తువులు, ఉండకూడదన్నారు. అపరిచితుల్ని ఇళ్ల వద్ద ఉండనివ్వవద్దని కోరారు. కౌంటింగ్ అనంతరం గెలుపోటములు ప్రకటిస్తారని, భావోద్రేకాలకు, ఇతరులపై కామెంట్లు చేయవద్దని హెచ్చరించారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు



శాఖా గ్రంథాలయంలో సమ్మర్ క్లాసులు నిర్వహిస్తున్న దృశ్యం



అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు సౌర కుటుంబంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. దేశ నాయకుల జీవిత చరిత్రలు చదివించారు. వలంటీర్ పి మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు సౌర కుటుంబం, చలనాలు, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ట్యాబ్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు డేవిడ్‌రాజు బాలల కోసం భారతరాజ్యాంగ ప్రవేశిక, దాని ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, రిటైర్డు లైబ్రేరియన్ గంధం శేషంవేంద్రరావు, ఆర్ దానకృష్ణ, ఎం శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌పై అవగాహన

తణుకు టౌన్: విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులలో భాగంగా తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించే వివిధ అంశాలను రీసోర్సు పర్సన్‌లు వివరించారు. ఈ కార్యక్రమంలో రిసోర్సు పర్సన్‌లు డీవీవీ రాజు, ఏ ధనరాజు, ఎన్‌వీ సుబ్బారావు, రిటైర్డ్ ఎంఈవో కే సత్యనారాయణ, వైఎస్ఎన్ వసంతరావు, బసవేశ్వరరావు, గ్రంథాలయ అధికారి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నేటి బాలలే రేపటి పౌరులని, గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు అన్నారు. గురువారం తాడేపల్లిగూడెం గ్రేడ్-1 శాఖాగ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు సమ్మర్ క్లాసులు నిర్వహించారు. తొలుత విద్యార్థులకు పుస్తక పఠనం, లెక్కలు, కథలు, జనరల్ నాలెడ్జ్, ఆధ్యాత్మిక విషయాలను జన విజ్ఞాన వేదిక జిల్లా సలహాదారులు ప్రత్తి వీరాస్వామి, రిసోర్స్‌పర్సన్స్ ఎస్.సత్యం, గరికిపాటి బాపయ్య శర్మ, వి.రమాంజనేయులు వివిధ అంశాలు నేర్పించారు. యోగా క్లాసులు జరిగాయి. ఈ శిక్షణ శిబిరంలో వివిధ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి వి.శ్రీనివాస్‌రావు వేసవి శిక్షణ తరగతులను పర్యవేక్షించారు.